క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

త్రిపురారం: మండల పరిధిలోని మాటూర్ 33కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మాటూర్ సబ్ స్టేషన్, నీలాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్, బొర్రాయిపాలెం, అప్పలమ్మగూడెం, లోక్యాతండా, సీత్యాతండా, రాగడప, పలుగుతండా, లచ్యాతండా, కాపువారిగూడెం, మాటూర్, చెన్నాయిపాలెం, వస్రాంతండా, అల్వాలపహాడ్, అంజనపల్లి, నీలాయిగూడెం, సత్యనారాయణపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బాలాజీనాయక్ తదితరులు

అడవిదేవులపల్లి: మండల కేంద్రానికి చెందిన ఎం. నాగమణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.18 వేలు, పిచ్చయ్యకు రూ.60 వేలు, శ్రీనుకు రూ.60 వేలు, మొల్కచర్ల గ్రామానికి చెందిన స్వామినాయక్‌కు రూ.28 వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కులను బుధవారం ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోలు నాగార్జున, చాంప్లా తండా సర్పంచ్ బాలునాయక్, కూరాకుల గోపినాథ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

మిర్యాలగూడ: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం భూపాలపల్లిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ కార్యకర్తలు కోడిగుడ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మిర్యాలగూడ మండల కేంద్రంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తంగెళ్ల సత్తిరెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బొంగర్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పరిమితి మించితే చర్యలు తప్పవు

చింతపల్లి: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గుడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్కూల్ బస్సులు, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు లైసెన్స్, ఆర్సీ తదితర ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం స్కూల్ బస్సుల యజమానులకు, బస్సు డ్రైవర్లకు, విద్యార్థులకు ఓవర్ లోడ్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ఆకాంక్ష స్కూల్ విద్యార్థులు

హాలియా: పట్టణంలోని ఆకాంక్ష స్కూల్‌కు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కరాటే మాస్టర్ పోతుగంటి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 28న హాలియాలో నిర్వహించిన అండర్–14 కటాస్ విభాగంలో ఆకాంక్ష స్కూల్‌కు చెందిన 17 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 5న యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూర్‌లో విక్టరీ సుమన్ షాటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ముకేష్, కార్తీక్, ప్రవీణ్, నాగచైతన్య, శివాణి, ప్రణతి, దీక్షిత్, గౌతమ్, నజీం బాబా, నవతేజ్, ఆదిత్య, తరుణి, అనూహ్య, శ్రీచరిత, నందన్, వర్మ, లోకేష్, గీతాంజలి, పూజిత పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మోదాల రవీందర్ అభినందించారు.

ప్రతీ పైసా లెక్కలోకి..

- నిధుల వినియోగంలో పాత విధానానికి విద్యాశాఖ చెక్
- పీఎఫ్ఎంఎస్ ద్వారా లావాదేవీలు
- ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించిన అధికారులు



తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఇప్పటి వరకు పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్సీ నిధుల వినియోగంపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన ఖర్చు పెట్టేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా సరికొత్త విధానానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. పీఎఫ్ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా లావాదేవీలు జరిగేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్సీ ఖాతాల్లో నిధులు విడుదల అయ్యాయి. పాఠశాలలు, ఎమ్మార్సీలు, సీఆర్పీల నిర్వహణ నిధుల వినియోగంలో నూతన విధానానికి విద్యాశాఖ తెర తీసింది. విద్యాశాఖ ఇటీవల బడుల నిర్వహణకు 50శాతం నిధులను విడుదల చేసింది. పాత నిధులను డిసెంబర్ 31 వరకు ఖర్చు చేస్తే మిగిలిన నిధులు విడుదలయ్యే అవకాశం కల్పించారు. లేకపోతే ఆ నిధులు వెనక్కి పంపిస్తామని ఆదేశాలు జారీ చేశారు.

బిల్లులు తప్పనిసరి

ఖర్చులకు సంబంధించి పాత పద్ధతి ప్రకారం ఎస్ఎంసీ, క్లస్టర్, హెచ్ఎం ఖాతా, ఎంఈఓ ఖాతాల్లో జమ చేసేవారు. ఎస్ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు కలిసి అవసరమైన బిల్లులు చెల్లించేవారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంతో ఇక ఈ పద్ధతి ఉండదు. విద్యాశాఖ వద్దనే నిధులు ఉంటాయి. పనులకు సంబంధించిన బిల్లులు పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పోర్టల్‌లో పొందుపరిచే బిల్లుల ఆధారంగా పనులు చేసే గుత్తేదారులు, సామగ్రిని కొనుగోలు చేసిన దుకాణ యజమాని ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతాయి. పాఠశాల అవసరాలకు ఏమైనా వస్తువులు కొనుగోలు చేసినా, చేసిన పనులకు ఎవరికైనా బిల్లులు చెల్లించాలన్నా దానికి సంబంధించిన వివరాలను పూర్తిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ విధానం ద్వారా నిధులు పక్కదారి పట్టేందుకు అవకాశాలు ఉండవని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

పాత నిధుల పరిస్థితి ఏమిటి?

పాఠశాలల్లో కొంతమంది హెచ్ఎంలు గతంలో విడుదలైన నిధులను ఖర్చు చేయలేదు. ఈ ఖాతాలను గతేడాది ముగింపులో బ్లాక్ చేయించారు. తద్వారా సదరు ఖాతాలో ఉన్న నిధులను వెనక్కి మళ్లించారు. ఈ నిధుల వినియోగంపై విద్యాశాఖ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో పాత నిధులపై సందిగ్ధత నెలకొంది.

పారదర్శకత కోసమే..



విద్యాశాఖకు సంబంధించి అన్ని ఖర్చులు పీఎఫ్ఎంఎస్ విధానంలో చేయాలి. అక్రమాలకు తావులేకుండా పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. దీనికి సంబంధించి మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాం.

– తరి రాము, ఎంఈఓ, తిరుమలగిరి

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దవూర: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్(ఎన్‌డీసీసీబీ) ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఏసీఎస్ బ్యాంకులో ఖాతా ఉండి, అప్పు పొంది రూ.456 చెల్లించిన రైతులకు సంవత్సరానికి రూ.2లక్షల బీమా వర్తిస్తుందని అన్నారు. పీఏసీఎస్ బ్యాంకులో రైతులకు తక్కువ వడ్డీకే గోల్డ్ లోన్‌లు, పంట రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఏడెకరాలు ఉన్న రైతులకే సహకార బ్యాంకు ద్వారా ట్రాక్టర్ రుణాన్ని అందించే వీలు ఉండేదని, దీని పరిమితిని ప్రస్తుతం మూడెకరాలకు తగ్గించినట్లు వివరించారు. రూ.25 లక్షలతో హార్వెస్టర్ కొనుగోలుకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల పిల్లలు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడానికి రూ.30లక్షల వరకు రుణాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ సూపర్‌వైజర్ ఆనంద్, పెద్దవూర పీఏసీఎస్ సీఈఓ వడ్డిరెడ్డి వెంకట్‌రెడ్డి, మనుబ్రహ్మాచారి, సిబ్బంది వెంకటయ్య, రామంజమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేత



మోడల్ పేపర్లు అందజేస్తున్న ఎంపీపీ రేఖ

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వార్షిక పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సొంత ఖర్చులతో విద్యార్థులకు పదో తరగతి వార్షిక పరీక్షల మోడల్ పేపర్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దోనియాల సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి



గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

కొండమల్లేపల్లి: నిధుల దుర్వినియోగానికి పాల్పడిన మండలంలోని దోనియాల గ్రామ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దోనియాల గ్రామపంచాయతీలో రూ.5లక్షలతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్ వాస్తు బాగోలేదంటూ సర్పంచ్ వాటర్ ట్యాంక్‌ను గదిగా మార్చి ప్రభుత్వ నిధులను దుర్వినియోగానికి పాల్పడ్డారని, గ్రామపంచాయతీ అభివృద్ధి విషయంలో వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని, ఈ విషయమై త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉప సర్పంచ్ సరిత, పాత్లావత్ వెంకటేశ్వర్లు, ఎలిమినేటి లింగయ్య, సత్యనారాయణ, నిమ్మల యాదగిరి, గుండాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణలో జాప్యం తగదు



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

మిర్యాలగూడ అర్బన్: వేతన సవరణ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదని బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో మిర్యాలగూడ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్సీ జేఏసీ డివిజన్ నాయకులు ఏ. వెంకటేశ్వర్లు, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వేతన సవరణ ఒప్పందం ప్రకారం 2022లో వేతన సవరణ చేయాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదని అన్నారు. జేఏసీ ఈ నెల 28వ తేదీ వరకు దశల వారీగా నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 1104 యూనియన్ నాయకులు కాతోజు సోమాచారి, ఏడీఈ పి. వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, ఏఈఈలు కిషన్‌లాల్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సీతారామరావు, కృష్ణారెడ్డి, రాంచందర్, మనోహర్, ఉదయగిరి, సురేష్, ఝాన్సీ, వెంకన్న, భార్గవి, కిరణ్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



పెద్దవూర: ఎంపీడీఓ విజయకుమారికి వినతిపత్రం అందిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు

పెద్దవూర: విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు(వీఓఏ)లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఐకేపీ, వీఓఏ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఓఏలకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస నెల వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఐడీ కార్డులు ఇవ్వాలని, డ్రెస్ కోడ్ అమలు చేయాలని, అర్హత కలిగిన వీఓఏలకు సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని, అక్రమంగా విధుల నుంచి తొలగించిన వీఓఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఓఏ సంఘం నాయకులు చిలుముల దుర్గయ్య, నాయిని లక్ష్మీ, పద్మ, శ్రీనివాస్, బికోజీ, చందు, భిక్షమయ్య, సత్యనారాయణ, మదన్, అరుణ, విజయలక్ష్మి, సుహాసిని, రజిత, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండలంలోని ఐకేపీ, వీఓఏల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండల సమాఖ్య నాయకులు మాట్లాడుతూ.. వీఓఏలకు ప్రభుత్వం ఇచ్చే రూ.3900 వేతనంతో కుటుంబ పోషణ భారమవుతుందని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలను నేరుగా వీఓఏల ఖాతాల్లోనే జమ చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ముని, జ్యోతి, వినోద, భ్రమరాంబ, భవానీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీరారెడ్డి



సీడీపీఓ మమతకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

మిర్యాలగూడ టౌన్: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మమతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని, జీఓ నంబర్లు 8, 14, 19లను సవరించాలని, అంగన్‌వాడీలకు ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి ఇంక్రిమెంట్లు, ఇన్‌చార్జిల అలవెన్స్‌లు చెల్లించాలని, అంగన్‌వాడీలకు హెల్త్‌కార్డులతో పాటు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని కోరారు. ఎలాంటి షరతులు లేకుండా సెంటర్లు అన్నింటినీ మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని, ప్రభుత్వ టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ టీచర్లకు వేతనం, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు బొందు పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డబ్బికార్ మల్లేష్, పట్టణ కార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి, నూకల జగదీష్‌చంద్రారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తూడి అరుణ, బి. నాగమణి, ప్రమీల, స్వరాజ్యం, రాధాబాయి, వెంకటమ్మ, విజయ, శ్రీదేవి, కళమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్



మంగలోనిబావి గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలోని గ్రామాలకు మహర్దశ పట్టుకుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు–మన ప్రభుత్వం–మన పథకాలు కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండల పరిధిలోని మంగలోనిబావి గ్రామంలో రూ.33లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామపంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకుల అరుణాసురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, నిర్మల పార్వతయ్య, నేనావత్ శ్రీనునాయక్, కొండల్, బొడ్డుపల్లి కృష్ణయ్య, వెంకటయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

చందంపేట: నేరెడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కేతేపల్లి గ్రామానికి, నేరెడుగొమ్ము నుంచి చర్లతండా వరకు బీటీ రోడ్లను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలునాయక్, సర్పంచులు కేశవులు, రాజు, మకట్‌లాల్ తదితరులు ఉన్నారు.

పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ కృషి

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్



మాచనపల్లిలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

మిర్యాలగూడ: రాష్ట్రంలో పేద ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషిచేస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. బుధవారం మాడ్గులపల్లి మండలంలోని మాచనపల్లి, అభంగాపురం, కేశవాపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాచనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ అందించే అభివృద్ధి ఫలాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రొయ్యల సైదులు, సర్పంచ్‌లు పద్మ, మహేశ్వరి, వెంకన్న, యాదగిరిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, మార్కెట్ డైరెక్టర్ ఖాసీం, దిలీప్‌రెడ్డి, ఆర్ఐ అక్తర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం



మాజీ మంత్రి రవీందర్‌నాయక్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ మంత్రి ధరావత్ రవీందర్‌నాయక్ ఆరోపించారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని గుడిపల్లి గ్రామంలో బీజేపీ గ్రామశక్తి కేంద్రం కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బేటీ బచావో బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకులు లాలునాయక్, కళ్యాణ్‌నాయక్, చెనమోని రాములు, ఏటీ కృష్ణ, వట్టెపు గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, గోలి రవి, స్వామి తదితరులున్నారు.

సమస్యలను అధికారులు పట్టించుకోవట్లేదు



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చందంపేట: తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సర్వసభ్య సమావేశంలో నిలదీశారు. నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బాణావత్ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు సర్పంచులు మిషన్ భగీరథ నీటి సరఫరా, విద్యుత్ తదితర సమస్యలపై ప్రస్తావించారు. తమ గ్రామపంచాయతీలకు ఇంకా నూతన భవనాలు మంజూరు చేయలేదని సర్పంచులు శభాష్‌నాయక్, రవీందర్ ప్రశ్నించారు. అనంతరం కాచరాజుపల్లి ఎంపీటీసీ సభ్యుడు బిక్కు నాయక్ మాట్లాడుతూ.. మండలంలోని ఎస్ఎస్‌పీ భూముల్లో కొంతమంది వెంచర్ చేసి విక్రయిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందించడం లేదని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బాలునాయక్, వైస్ ఎంపీపీ ముత్యాలమ్మ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిరుపతయ్య, సర్పంచులు కేశవులు, అంజయ్య, బావోజీ, కోఆప్షన్ సభ్యుడు పాషా, ఎంపీటీసీలు, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, తహసీల్దార్ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయకుల పరామర్శ

త్రిపురారం: మండల కేంద్రానికి చెందిన నాగార్జునసాగర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి నరేష్ తల్లి కసిరెడ్డి కోటమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, జైవీర్‌రెడ్డిలు బుధవారం కోటమ్మ మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్, పాదిల వెంకన్న, ఇరిగి మధు, సలీం, నామా అరుణ్ తదితరులు ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



దేవరకొండ: అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



హాలియా: నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు



మిర్యాలగూడ టౌన్: నివాళులర్పిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు



కొండమల్లేపల్లి: అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారికి ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో బుధవారం దేవరకొండలో ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో అమరవీరుల చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాదిగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చేపట్టిన గాంధీభవన్ ముట్టడిలో ప్రమాదవశాత్తు తీవ్రగాయాలపాలై మృతిచెందిన ఎస్సీ అమరులకు గుర్తుగా మార్చి 1వ తేదీన అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అందుగుల సైదులు, దర్శనం శివ, బుడిగపాక గోవర్ధన్, ముదిగొండ సాగర్, మల్లయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు గడుసు సైదీష్ మాదిగ మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించి అమరవీరులకు అంకితం ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో గార్లపాటి ప్రసాద్, ఏర్పుల వెంకటయ్య, సైదులు, యడవెల్లి రాంబాబు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మచ్చ ఏడుకొండలు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి మాట తప్పిందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సయ్యద్ ఫారూఖ్, సంద్ర నాగరాజు, నరేష్, వినయ్, మహేష్, గణ నాగేంద్రబాబు, రవి, పవన్, మనోజ్ తదితరులున్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లిలోని చౌరస్తా వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతెం సహదేవుడు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుపాక గోపాల్, అందుగుల తిరుపతయ్య, వస్కుల విజయ్, మల్లేశ్, అందుగుల కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.